క్లుప్తంగా

ఒకే పాస్‌పై సందర్శన



సైన్స్ మ్యూజియాన్ని సందర్శించిన విద్యార్థులు

నెల్లూరు (టౌన్) : వచ్చేనెల నుంచి ప్రతిరోజు మూడు పాఠశాలల విద్యార్థులు ఒకే పాస్‌పై జిల్లా సైన్స్ మ్యూజియం, ఆర్కియాలజీ మ్యూజియం, నగర వనంలను సందర్శించే విధంగా ప్రణాళికను అమలు చేసేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి కరుణాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక చెముడుగుంటలోని జిల్లా సైన్స్ మ్యూజియాన్ని నెహ్రూ నికేతన్, శ్రీచక్ర పాఠశాలల విద్యార్థులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా సైన్స్ మ్యూజియం ప్రాంగణంలో రూ.5 కోట్లతో ఆడిటోరియం, ప్లానిటోరియాలను నిర్మించేందుకు దాతలు గంటా రమణయ్యనాయుడు ఆసక్తి చూపినట్లు చెప్పారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ప్రతిరోజు వర్క్‌షాపు నిర్వహించేలా కృషి చేస్తున్నామన్నారు.

పశువుల తరలింపుపై స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(బారకాసు) : ప్రధాన రోడ్లపై వాహనదారులకు అడ్డంకిగా మారిన పశువులను తరలించేందుకు ప్రతిరోజు రాత్రి స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహిస్తున్నట్లు వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ మదన్‌మోహన్ తెలిపారు. స్థానిక నెక్లెస్ రోడ్డు, మద్రాసు బస్టాండు, ట్రంకురోడ్డు ప్రాంతాల్లో సంచరిస్తున్న నాలుగు పశువులను శనివారం వేకువజామున పట్టుకుని కల్లూరుపల్లి గోశాలకు తరలించారు. పశువుల యజమానులు బాధ్యతగా వ్యవహరించి, వాటిని చూసుకోవాలని తెలిపారు. లేకుంటే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

వైభవంగా పడిపూజ

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల పూజలు, రాత్రి పడిపూజను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయాన్ని పుష్పాలంకరణతో తీర్చిదిద్దారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. ఉభయకర్తలుగా డాక్టర్ బి.నరసింహారెడ్డి– విజయ దంపతులు, రిత్విక్‌రెడ్డి, రఘురామిరెడ్డి వ్యవహరించారు. శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పావళ్ల ప్రసాద్ పర్యవేక్షించారు.

నిబంధనలు పాటించకుంటే ఓసీ నిలుపుదల

నెల్లూరు(బారకాసు) : నగరంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన భవన నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) జారీ చేయబోమని కమిషనర్ సూర్యతేజ స్పష్టం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతుల దస్త్రాలను శనివారం తనిఖీ చేశారు. ప్రధానంగా సెట్‌బ్యాక్ పోర్షన్‌లో నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు పెట్టడానికి వీలు లేదన్నారు. ర్యాంప్‌లు రోడ్డు మీద వరకు రాకూడదని, గ్రీనరీకి కేటాయించిన విధంగా ఉండాలన్నారు. అనంతరం ముత్తుకూరు ఫ్లైఓవర్ సుందరీకరణ పనులను పరిశీలించారు.

బ్యాటరీ వాహనం అందుబాటులోకి..

ఎస్‌ఎంసీ కార్యాలయంలోని బ్యాటరీ వాహనం అందుబాటులోకి వచ్చిందని కమిషనర్ తెలిపారు. పనివేళల్లో సిబ్బందితో పాటు ప్రజలకు ప్రధాన గేటు నుంచి కార్యాలయం లోపల వరకు తిరిగేలా వాహనాన్ని నడిపించాలని ఆదేశించారు.

ఉత్సాహంగా క్యాండిల్ లైట్ సర్వీస్

నెల్లూరు(బృందావనం) : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని క్యాండిల్ లైట్ సర్వీస్‌ను శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్టు చర్చి డానీహాల్లో వి.ప్రభావతిపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అంతర్జాతీయ ప్రసంగీకురాలు రెవరెండ్ అంశుమతి మేరీ వాక్యోపదేశం చేశారు. రెవ కె.శ్యాంసన్‌కుమార్, కె.హుల్దా శ్యాంసన్‌లు కేక్ కటింగ్ చేశారు.

ఎక్స్‌పోకు అనూహ్య స్పందన



నెల్లూరు(బృందావనం) : నగరంలోని వీఆర్సీ మైదానంలో బీఎస్పార్ ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఓన్ యువర్ స్టాల్ ఎట్ జెడ్ ఎక్స్‌పో' ఎగ్జిబిషన్‌కు అనూహ్య స్పందన లభిస్తోంది. ఈ సందర్భంగా ఆర్గనైజర్స్ బాలశ్రీనివాసులురెడ్డి, శేఖర్‌రెడ్డి శనివారం మాట్లాడుతూ బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ తరహాలో దీనిని ఏర్పాటు చేశామన్నారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు ఎక్స్‌పో ఉంటుందన్నారు.

మినరల్ మాయ

- వాటర్ ప్లాంట్ల నిర్వహణపై అనేక సందేహాలు
- ఐఎస్ఐ ధ్రువీకరణ లేకుండానే నీటి అమ్మకం
- రుచికోసం కెమికల్స్ కలుపుతూ మోసం



నగరంలోని మినరల్ వాటర్ ప్లాంట్

నెల్లూరు(బారకాసు): నగర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒకటి తాగునీరు. ప్రస్తుతం తాగునీటి కోసం కచ్చితంగా మినరల్ వాటర్ ప్లాంట్లపై ఆధారపడాల్సి వస్తోంది. అంతర్జాతీయ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం రోజులో మనిషికి 10 లీటర్లకు తగ్గకుండా తాగునీటిని సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఈ లెక్కన నగరపాలక సంస్థ పరిధిలోని దాదాపు 8 లక్షల జనాభాకు లక్షలాది లీటర్ల నీరు కావాలి. అయితే నగరంలో ఒక్కొక్కరికి డబ్ల్యూహెచ్‌ఓ చెప్పిన దానిలో సగం నీరు కూడా అందడం లేదని తెలుస్తోంది. దీంతో వాటర్‌ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇప్పటికే దాదాపు 200 నుంచి 300 వరకు ప్లాంట్లు వ్యాపార లావాదేవీలు సాగిస్తున్నాయి. కానీ దాదాపు అన్ని ప్లాంట్లలో కనీస రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. పేరుకే మినరల్ వాటర్ కానీ.. అంతర్జాతీయ ప్రమాణాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాగో అనుమతులు తెచ్చుకొని సాదాసీదాగా క్యాన్‌లలో నీరు నింపుతున్నారు. ఇలాంటి అశుద్ధ నీటిని తాగితే జుట్టు రాలిపోవడం, అతిసార, కిడ్నీ సంబంధిత వ్యాధులు విజృంభిస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

చౌకగా ప్లాంట్ల నిర్మాణం

అన్ని ప్రమాణాలు పాటించి మినరల్ వాటర్ అందించాలంటే భారీ వ్యయం చేయాల్సిందే. కానీ నెల్లూరు నగరంలో చాలా చోట్ల కేవలం రెండు నుంచి మూడు లక్షల రూపాయలతో చిన్నచిన్న వాటర్ ప్లాంట్లు వెలుస్తుండడం గమనార్హం. వీరు తొలుత బోరు వేయించి ప్లాస్టిక్ ట్యాంకులను కొనుగోలు చేస్తున్నారు. అతి చౌకగా ప్యూరిఫైడ్ మిషనరీ తీసుకుని నీటిని శుద్ధి చేస్తున్నారు. సోడియం, కార్బొనేట్, సోడియం క్లోరైడ్, శాక్రిన్ కలిపి నీటికి రుచి తెస్తున్నారు. ఆ తర్వాత యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. వీరు ల్యాబ్ టెస్టింగ్ చేయరు.. వాటర్ క్యాన్‌లపై తయారీ తేదీ (ఎంఎఫ్‌డీ) కూడా ఉండదు. అయినప్పటికీ అధికారులు ఉలుకూ.. పలుకూ లేకుండా ఉంటారు.

ఇష్టం వచ్చిన రేటుకు అమ్మేస్తున్నారు

నిబంధనలు పట్టించుకోకుండా నీటిని ప్యాక్ చేయడమే కాకుండా రేట్లను కూడా ఇష్టానుసారంగా విధిస్తున్నారు. 20 లీటర్ల నీటిని రూ.10 నుంచి రూ.20 వరకు విక్రయిస్తున్నారు. 200 వాటర్ ప్యాకెట్లున్న బ్యాగును రూ.50కి విక్రయిస్తుండగా.. విడిగా ఒక్కో ప్యాకెట్ రెండు రూపాయలకు అమ్ముకుంటున్నారు. నెల్లూరు నగరంలో నీటి వ్యాపారం కోట్లలో ఉండొచ్చని అంచనా.

ఇవీ నిబంధనలు

- ప్లాంటుకు కనీసం 2,200 చదరపు మీటర్లు కేటాయించి నిర్మాణం చేపట్టాలి.
- నీటిని నిల్వ ఉంచేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ ట్యాంకులనే వాడాలి.
- పంపింగ్ చేసేటప్పుడు కూడా స్టెయిన్‌లెస్ స్టీల్ పైపులనే ఉపయోగించాలి.
- అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రివర్స్ ఆస్మాసిస్ ప్రక్రియ ద్వారా నీటిని శుభ్రపరచాలి.
- నీటిలోని వైరస్, బ్యాక్టీరియాను నాశనం చేయడానికి అల్ట్రా వైలెట్ సిస్టమ్‌ను వినియోగించాలి.
- బీఐఎస్ నిబంధనలకు అనుగుణంగా వాటర్ ప్లాంట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి.
- శుద్ధి నీటిని క్వాలిఫైడ్ టెక్నీషియన్ ద్వారా పరీక్షించాలి. తర్వాతే మార్కెట్‌లో విక్రయించాలి.

నిబంధనలు పాటించకుంటే చర్యలు



వాటర్ ప్లాంట్ల యజమానులు ప్రమాణాలు పాటిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకే మినరల్ వాటర్‌ను విక్రయించాలి. అలా కాకుండా నిబంధనలు అతిక్రమించి ఇష్టానుసారంగా విక్రయిస్తే చర్యలు తప్పవు. ఇటీవల మినరల్ వాటర్ సరఫరా చేస్తున్న వాహనాన్ని తనిఖీ చేసినప్పుడు అందులో వాటర్‌ప్యాకెట్లపై తయారీ, ఎక్స్‌పెయిరీ తేదీ తదితర వివరాలు ఏమీ లేకపోవడంతో వాటిని అక్కడికక్కడే స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేశాం. అంతేకాకుండా సంబంధిత యజమానికి నోటీసులు జారీ చేసి జరిమానా విధించాం.

– డాక్టర్ చైతన్య , ఎంహెచ్‌ఓ, మున్సిపల్ కార్పొరేషన్, నెల్లూరు

వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ నూతన కమిటీ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శిగా పొన్నం రవిచంద్ర, కోశాధికారిగా జీకే గోపీనాథ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ వాకర్ అంకిరెడ్డి, వ్యవస్థాపకుడు మేకల నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ వాకర్స్‌కు మంచి కార్యక్రమాలు నిర్వహించి అసోసియేషన్‌కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీవీ సుబ్బరాజు, స్వర్ణ రమేష్‌బాబు, కె.జయదేవ్ పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : వైద్యారోగ్యశాఖలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయాలని పలువురు హెల్త్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు గోమతి నగర్‌లోని జనసేన కార్యాలయంలో ఏపీ టిడ్కో చైర్మన్ అజయ్ కుమార్‌ను శనివారం కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు మాట్లాడుతూ తాము 2002లో వైద్యశాఖ నిర్వహించిన డీఎస్సీ ద్వారా అర్హత సాధించి ఉద్యోగంలో చేరామన్నారు. 22 ఏళ్ల తర్వాత తెలంగాణ హైకోర్టు తీర్పు అంటూ 54 మంది హెల్త్ అసిస్టెంట్లను తొలగించడం అన్యాయమన్నారు. ఉద్యోగాల నుంచి తొలగించడం వల్ల ముగ్గురు హెల్త్ అసిస్టెంట్లు ఇప్పటికే ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మానవతా కోణంలో ఆలోచించి తమను ఉద్యోగాల్లో చేర్చుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆయుర్వేద వైద్యశిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీవాత్సవ

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ఇందిరాభవన్ వెనుక రోడ్డులో ఉన్న ధన్వంతరి కేరళ ఆయుర్ కేర్ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆస్పత్రి మూడో వార్షికోత్సవం సందర్భంగా డాక్టర్ రమణారెడ్డి, ఆస్ట్రాలజిర్ అశోక్‌లు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో వచ్చిన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అధినేత డాక్టర్ శ్రీవాత్సవకుమార్ మాట్లాడుతూ మొండినొప్పులు, దీర్ఘకాలిక వ్యాధులను ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు లేనివిధంగా ఆయుర్వేద వైద్యంతో తగ్గించవచ్చన్నారు. కేరళకు చెందిన ప్రత్యేక పంచకర్మలాంటి చికిత్సలకు 20 శాతం రాయితీ ఇస్తున్నామన్నారు. పేదలు, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో మంచి వైద్యసేవలందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భరద్వాజ్, తిరుమలశెట్టి చంద్ర, నాగార్జున పాల్గొన్నారు.

ఏపీఎస్ఈఎస్ఏ జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్



ఎంపికైన నూతన కార్యవర్గ సభ్యులు

నెల్లూరు (టౌన్) : ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కె.రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. స్థానిక దర్గామిట్టలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.సురేష్, కోశాధికారిగా సీహెచ్.వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఏవీ సురేష్‌లను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, గిరీష్‌చంద్ర, మోహన్‌రావు, స్వర్ణలత, ప్రశాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మస్తాన్, సంయుక్త కార్యదర్శులుగా వెంకటసాయితేజ, సాయిమనోజ్‌కుమార్‌రెడ్డి, సుఫియాన్, ప్రవీణ్‌కుమార్, తాయిబ్‌అమీన్, మహిళా కార్యదర్శిగా బి.గీతావాణిలను ఎంపిక చేశారు. అనంతరం అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎన్నికల అధికారిగా వి.వజ్రబాబు వ్యవహరించగా విద్యాశాఖ ఏడీలు రఘురామయ్య, గోపాల్, ప్రసన్నలక్ష్మి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మకుమారి, గౌరవాధ్యక్షుడు స్వాములు, రాష్ట్ర ఎస్‌జీజీఓ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

వివాహితపై దాడి

నెల్లూరు(క్రైమ్) : కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహితపై ఆమె మామ దాడి చేసిన ఘటన రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. రామచంద్రాపురంలో ధనూజ, శివ దంపతులు నివాసం ఉంటున్నారు. ఆమె నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యురాలిగా పనిచేస్తోంది. గత కొంతకాలంగా దంపతుల నడుమ మనస్పర్థలున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ధనూజపై ఆమె మామ అంకుల్‌రాయడ్ ఇనుప రాడ్డుతో దాడిచేశాడు. దీంతో ఆమెకు గాయలయ్యాయి. ఈ మేరకు బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేశారు.

ఘనంగా దత్త జయంతి



చతుర్వేద పండితులకు సన్మానం

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో దత్త జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పండితులను సన్మానించారు. నిర్వాహకుడు ఆనందకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కపిలవాయి అచ్యుత రామారావు పాల్గొని, ఉపన్యసించారు. అనంతరం చతుర్వేద పండితులు ముక్కామల వశిష్టశర్మ, పవన్‌కుమార్ చైతన్య శర్మ, కొత్తలంక సుబ్రహ్మణ్యశర్మ, తుర్లపాటి పవన్‌కుమార్‌శర్మలను సత్కరించారు. స్వామి సమయానందనాథ, మైపాడు రాజాశర్మ పర్యవేక్షించారు.

పరిశుభ్రత పాటించండి



ఫౌంటైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు) : నగర మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంతో పాటు ఇతర ప్రాంతాల్లో పరిశుభ్రత తప్పక పాటించాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. ఎస్‌ఎంసీ కార్యాలయ ప్రాంగణంలోని ఫౌంటైన్, క్యాంటిన్, పార్కింగ్ ప్రదేశం తదితరాలను కమిషనర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిరుపయోగంగా పడి ఉన్న ప్రయాణికుల బగ్గీ వాహనాన్ని మరమ్మతులు చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఇక్కడ పేరుకుపోయిన ప్లాస్టిక్, ఐరన్ వ్యర్థాలను వెంటనే తొలగించి పరిశుభ్రంగా ఉంచేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగ ఎస్ఈ రామ్మోహన్‌రావు, ఈఈలు శేషగిరిరావు, రంతుజానీ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఉంటాయని ఆ శాఖ టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృద్ధురాలి అదృశ్యం



జీవమ్మ

నెల్లూరు(క్రైమ్) : వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై నవాబుపేట పోలీసులు శనివారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంటరోడ్డు వీవర్స్‌కాలనీలో శ్యామ్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన తల్లి జీవమ్మ మతిస్థిమితం సరిలేక బాధపడుతోంది. టిఫెన్ కోసం ఇంటి నుంచి వెళ్లి ఆమె అదృశ్యమైంది. కుమారుడు ఆమె కోసం గాలించినా జాడ తెలియకపోవడంతో నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 94407 96306, 94407 96310లను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా కోరారు.

పరవకొట్టయ్ ఆండవన్‌కు స్వాగతం



నెల్లూరు(బృందావనం) : శ్రీరంగానికి చెందిన పరవకొట్టయ్ ఆండవన్ స్వామి రంగనాయకులపేటలోని వేదాంతదేశికర్ దేవస్థానానికి శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి మహాకుంభ ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో కేసీ వరదరాజన్, కె.రామదొరై, ఎన్సీ బాలాజీ, బండేపల్లి రాజగోపాల్, రమేష్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలని వినతి

నెల్లూరు (టౌన్) : రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్టు లెక్చరర్ల జేఏసీ చైర్మన్ సురేష్, కో–చైర్మన్ శ్రీనివాసులు కోరారు. మంగళగిరిలో సీఎం చంద్రబాబును శనివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో మే నెల వేతనం పెండింగ్‌లో ఉందని, ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలన్నారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు.

కలెక్టర్‌తో టిడ్కో చైర్మన్ భేటీ

నెల్లూరు(అర్బన్) : ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ కలెక్టర్ ఆనంద్‌తో శనివారం భేటీ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసి సన్మానించారు. అనంతరం అజయ్‌కుమార్ మాట్లాడుతూ పూర్తయిన టిడ్కో ఇళ్ల వద్ద కనీస వసతులు కల్పించాలని, అసాంఘిక కార్యక్రమాలను కట్టడి చేయాలని కోరారు. అల్లీపురం వద్ద ట్యాంక్‌ను నిర్మించినప్పటికీ నీటి వసతి సరిగ్గా లేదన్నారు. జనసేన నేతలు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిశోర్, జమీర్, రిషికేష్, శరత్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

22న కేతా అవార్డ్స్ ప్రదానం



నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో ఈనెల 22న కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు 'కేతా అవార్డ్స్' అందజేయనున్నట్లు తబలిస్ట్, కళాకారుడు లంక ఆనంద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను నర్తకి సెంటర్‌లో శనివారం ఆవిష్కరించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పాటలు, డ్యాన్స్ పోటీలతో పాటు జూనియర్, సీనియర్ విభాగాల్లో నగదు బహుమతి ఉంటుందన్నారు. ఆసక్తి గల కళాకారులు ఫోన్ నంబర్ 77299 42543ను సంప్రదించాలన్నారు. నిర్వాహకులు కేతా సుబ్బారావు, రఘురామిరెడ్డి, లక్ష్మీపతి, ఎం.మధు, కేఎస్ బాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆత్మార్పణ దినోత్సవం నేడు

నెల్లూరు(అర్బన్) : ప్రభుత్వ ఆదేశాల మేరకు అమరజీవి శ్రీపొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఆత్మకూరు బస్టాండ్ కూడలిలో శ్రీపొట్టిశ్రీరాములు విగ్రహానికి జిల్లా అధికారులు, ప్రముఖులు పుష్పాంజలి ఘటించి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆత్మార్పణ దినోత్సవ సభను నిర్వహిస్తామని తెలియజేశారు.

అన్నదానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : దత్త జయంతి సందర్భంగా అయ్యప్పగుడి ప్రాంతంలోని సాయిబాబా మందిరంలో అన్నదాన కార్యక్రమం ఆదివారం జరిగింది. నిర్వాహకుడు ఎల్వీ కృష్ణారెడ్డి, పురుషోత్తం యాదవ్, సాయిసునీల్, జావిద్, అమరేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నటరాజా, ప్రసాద్, రాజా, కుమార్ పాల్గొన్నారు.

కేన్సర్ ఆస్పత్రికి రూ.4 లక్షల విరాళం



నెల్లూరు(అర్బన్) : నగరంలోని పొదలకూరు రోడ్డులో ఉన్న కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు నగరానికి చెందిన దేవల శ్యామల అనే మహిళ దివంగత చింత లలితమ్మ జ్ఞాపకార్థం రూ.4 లక్షలను విరాళంగా అందించారు. ఇందుకు సంబంధించిన చెక్కును రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం అందించారు. కార్యక్రమంలో స్పాస్టిక్ సెంటర్ కన్వీనర్ నేతాజి సుబ్బారెడ్డి, కేన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి, మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, ఆర్థోపెడిక్ డాక్టర్ హరికృష్ణారెడ్డి, ఆస్పత్రి జీఎం భక్తవత్సలరెడ్డి పాల్గొన్నారు.

టీబీ, లెప్రసీలను అరికడదాం



అర్బన్ హెల్త్ సెంటర్‌లో ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్) : జిల్లాలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న టీబీ, అలాగే ఇంకా అక్కడక్కడ కనిపిస్తున్న లెప్రసీ జబ్బులను పూర్తిస్థాయిలో అరికట్టడమే లక్ష్యంతో వైద్యసిబ్బంది కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా టీబీ, లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. నగరంలోని రాజాగారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్, చాకలివీధిలో ఉన్న అర్బన్ కేంద్రం, జిల్లా క్షయ నివారణ కేంద్రంలో ఉన్న ల్యాబ్, ఐసీటీసీ కేంద్రం, బీవీనగర్‌లో ఉన్న డామియన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ కేంద్రాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. ప్రజలు అవగాహన లేక, తగిన జాగ్రత్తలు పాటించకపోవడం వల్లనే ఈ జబ్బులు వస్తున్నాయన్నారు. మొదట్లోనే ఈ జబ్బులు గుర్తిస్తే తగిన వైద్యం ద్వారా నయం చేయవచ్చన్నారు. ప్రజలను టీబీ, లెప్రసీపై వైద్యసిబ్బంది అప్రమత్తం చేయాలన్నారు.

మెడికవర్ ఫ్యామిలీ కార్డు ఆవిష్కరణ



నెల్లూరు(క్రైమ్) : మెడికవర్ హాస్పిటల్‌లో రూ.500ల ఫ్యామిలీ కార్డును ఎస్పీ జి.కృష్ణకాంత్ తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్‌రెడ్డి, మార్కెటింగ్ హెడ్ సతీష్‌లు తొలి కార్డును ఎస్పీకి అందజేశారు. ఈ సందర్భంగా ధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ మెడికవర్ ఫ్యామిలీ కార్డు ద్వారా ఓపీ కన్సల్టెన్సీపై 25 శాతం, పరీక్షలపై 15 శాతం రాయితీ పొందవచ్చన్నారు. అడ్మిషన్‌పై 10 శాతం, వైద్యేతర సేవలపై 50 శాతం, పది కిలోమీటర్లలోపు ఉచిత అంబులెన్స్ సదుపాయం ఉంటుందన్నారు. దేశంలోని అన్ని మెడికవర్ హాస్పిటల్స్‌లో చెల్లుబాటు అవుతందన్నారు. మెడికవర్ పీఆర్వో చందువర్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరు(బృందావనం) : డానీహాల్ ఇంగ్లిష్ సర్వీస్ ఆధ్వర్యంలో వీఆర్సీ కూడలిలోని బాప్టిస్టు చర్చి డానీహాల్లో శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సండే స్కూల్ సూపరింటెండెంట్ వై.శారా ప్రవీణ, కో–ఆర్డినేటర్ ఎ.విజయపాల్, పాస్టర్ డేవిడ్ దయాసాగర్, సంజయ్, ఉపాధ్యాయులు ప్రపూర్ణ, శిరీష, సంధ్యా, గ్రేస్, అలేఖ్య పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ఆవిర్భావ దినోత్సవం



ట్రోఫీని అందజేస్తున్న జేసీ కార్తీక్

నెల్లూరు సిటీ : 62వ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఆవిర్భావ దినోత్సవాన్ని కొత్తూరులోని కేంద్రియ విద్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యున్నత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ట్రోఫీ, ప్రశంసా పత్రాలు అందజేశారు. జేసీ కార్తీక్ పాల్గొని, విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ప్రిన్సిపల్ శంకరయ్య, సీసీఏ కో–ఆర్డినేటర్ అలివేలు, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జీఓ 77ను రద్దు చేయాలి

నెల్లూరు (టౌన్) : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ నంబర్ 77ను రద్దు చేస్తామని నారా లోకేశ్ హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా నేటికీ పట్టించుకోవడం లేదని, వెంటనే ఆ జీఓను రద్దు చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాహుల్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.6,500 కోట్ల విద్యాదీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి, డ్రగ్స్ వాడకంపై చర్యలు తీసుకుంటామని చెప్పారని, అయితే ప్రస్తుతం వీటి వినియోగం పెరిగిందన్నారు. అదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.